జీడీపీ లెక్క ఓ మిస్టరీ

- నేను అర్థం చేసుకోలేకపోతున్నా
- 3 శాతం వినియోగం ఉంటే 8 శాతం వృద్ధి ఎలా సాధ్యం
- మాజీ సీఈఏ అరవింద్ సుబ్రమణియన్

న్యూఢిల్లీ, మార్చి 15: ప్రపంచంలో అత్యంత వేగవంతమైన వృద్ధి సాధిస్తున్న దేశంగా చూపిస్తూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా జీడీపీ గణాంకాలు ఒక మిస్టరీగా ఉన్నాయని మాజీ చీఫ్ ఎకనామిక్ అడ్వయిజర్ (సీఈఏ) అరవింద్ సుబ్రమణియన్ అభివర్ణించారు. 2023 క్యాలండర్ సంవత్సరం చివరి మూడు నెలల్లో భారత ఆర్థిక వ్యవస్థ విశ్లేషకుల అంచనాల్ని మించి 8.4 శాతం వృద్ధిచెందినట్టు ఇటీవల గణాంకాలు వెలువడ్డాయి. ఈ అంకె మూడున్నర ఏండ్ల గరిష్ఠ స్థాయి. అలాగే తొలి త్రైమాసికం జీడీపీ వృద్ధి రేటును 7.8 శాతం నుంచి 8.2 శాతానికి, ద్వితీయ త్రైమాసికం వృద్ధి రేటును 7.6 శాతం నుంచి 8.1 శాతానికి పెంచుతూ జాతీయ గణాంకాల శాఖ (ఎన్ఎస్ఓ) సవరించింది. ఈ డాటాపై సుబ్రమణియన్ ఒక సదస్సులో మాట్లాడుతూ 'తాజా జీడీపీ అంకెలపై అభిప్రాయాన్ని నేను నిజాయితీగా మీకు తెలియచేస్తున్నా. వాటిని నేను అర్థం చేసుకోలేకపోతున్నా. అవి పూర్తిగా మాయాస్పదమైనవి. అవి ఏమిటో తెలియడం లేదు' అని వ్యాఖ్యానించారు. 'ప్రైవేటు వినియోగం 3 శాతమే ఉన్నా, ఆర్థిక వ్యవస్థ ఏడున్నర శాతం వృద్ధిచెందడం దిగ్భ్రాంతి కలిగించే అంశమని అన్నారు. తాజా డాటాలో జరిగిన తప్పుల్ని తొలగిస్తే, 2024 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన వృద్ధి అంచనా 7.6 శాతానికి బదులు వాస్తవ వృద్ధి రేటు 4.3 శాతం ఉంటుందని సుబ్రమణియన్ విశ్లేషించారు. పెట్టుబడులకు భారత ఆర్థిక వ్యవస్థ చాలా మంచి కేంద్రం అన్న బజ్ ఉన్నప్పటికీ, గత కొద్ది త్రైమాసికాలుగా, కొద్ది సంవత్సరాలుగా పెట్టుబడులు తీవ్రంగా తగ్గుతున్నాయని మాజీ సీఈఏ వివరిస్తూ 'మీరు చూస్తే, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వాస్తవానికి పడిపోయాయి' అని చెప్పారు. 'భారత్ పెట్టుబడులకు ఆకర్షణీయమైన ప్రదేశం అయితే, ఎందుకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావడం లేదు' అని ప్రశ్నించారు. ప్రైవేటు పెట్టుబడులు, కార్పొరేట్ పెట్టుబడులు 2016 స్థాయికంటే దిగువనే ఉన్నాయన్నారు.

భారత్ పెద్ద మార్కెట్ కాదు

ఒక ప్రశ్నకు సీఈఏ స్పందిస్తూ ఇండియా పెద్ద మార్కెట్ అనే అపోహ నుంచి భారతీయులు బయటకు రావాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ జీడీపీ 3 ట్రిలియన్ డాలర్లకుపైబడి ఉండగా, మధ్యతరగతి వర్గాల మార్కెట్ 750 బిలియన్ డాలర్లు మాత్రమేనని, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఇది 20-30 ట్రిలియన్ డాలర్లు ఉంటుందని, దీంతో మనం పోల్చుకోవచ్చన్నారు. 'దేశీయ మార్కెట్ ఆధారంగా మనం వృద్ధిచెందవచ్చని ఆలోచించడం పొరపాటు. మన జడ్జిమెంట్‌లో అది పెద్ద తప్పు' అని వ్యాఖ్యానించారు. ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత తయారీ ఉత్పత్తుల వృద్ధి రేటు 15 శాతం లేకుండా, 7-8 శాతం వృద్ధిని ఏ దేశం సాధించలేదని వివరించారు.

ఎల్ఐసీ జీతాల పెంపునకు కేంద్రం ఓకే

న్యూఢిల్లీ, మార్చి 15: దేశీయ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది. 1.10 లక్షల మంది ఉద్యోగుల 17 శాతం వేతన పెంపు ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వరంగ బ్యాంకుల ఉద్యోగుల జీతాల పెంచిన కొన్ని రోజుల్లోనే ఎల్ఐసీ సిబ్బంది వేతనాల పెంపునకు అనుమతించడం విశేషం. దీంతో ఎల్ఐసీ ఉద్యోగుల వేతనాలు ఆగస్టు 1, 2022 నుంచి అమలులోకి రానున్నాయి. అలాగే ఏప్రిల్ 1, 2010 తర్వాత ఎల్ఐసీలో చేరిన 24 వేల మంది ఉద్యోగుల ఎన్‌పీఎస్ వాటా 10 శాతం నుంచి 14 శాతానికి పెరగనున్నది. వీరితోపాటు 30 వేల మంది పెన్షనర్లకు కూడా ఆర్థిక ప్రయోజనం కలగనున్నది.

గూగుల్ ప్లేస్టోర్‌పై దర్యాప్తు

ధరల విధానానికి సంబంధించి సీసీఐ ఆదేశం • కాంపిటీషన్ చట్టం ఉల్లంఘనలపై దృష్టి

న్యూఢిల్లీ, మార్చి 15: గూగుల్ ప్లే స్టోర్ ధరల విధానంపై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) శుక్రవారం విచారణకు ఆదేశించింది. ఆరోగ్యకరమైన పోటీయుత వాతావరణానికి భంగం కలిగించేలా గూగుల్ నడుచుకుంటున్నదన్న ఆరోపణలపై సీసీఐ స్పందించింది. కాంపిటీషన్ లా ఉల్లంఘనలకు పాల్పడిందంటూ దర్యాప్తునకు దిగింది. కాగా, పేమెంట్స్ ఇష్యూతో ప్లే స్టోర్ నుంచి గూగుల్ కొన్ని యాప్స్‌ను ఇటీవల తొలగించిన విషయం తెలిసిందే. ఇది పెద్ద దుమారాన్నే రేపగా.. మళ్లీ సదరు యాప్‌లను పునరుద్ధరించిన సంగతీ విదితమే. దీనిపై కేంద్ర ప్రభుత్వం కూడా సీరియస్‌గా స్పందించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు సీసీఐ ఆదేశాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అనుపమ్ మిట్టల్‌కు చెందిన పీపుల్ ఇంటరాక్టివ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మెబిగో ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ అండ్ డిజిటల్ ఫౌండేషన్ (ఐబీడీఎఫ్), ఇండియన్ డిజిటల్ మీడియా ఇండస్ట్రీ ఫౌండేషన్ (ఐడీఎంఐఎఫ్) సంస్థలు.. గూగుల్ ప్లే స్టోర్‌కు సంబంధించి మారిన పేమెంట్ విధానాలతో ఇబ్బందులు పడ్డట్టు సీసీఐ దృష్టికి వచ్చింది. అలాగే యాప్ డెవలపర్లు, పేమెంట్ ప్రాసెసర్లు, ఇతర వినియోగదారులకూ సమస్యలు వచ్చినట్టు సీసీఐ చెప్పున్నది. ఈ నేపథ్యంలోనే కాంపిటీషన్ చట్టంలోని సెక్షన్ 4 ఉల్లంఘన జరిగిందని గుర్తించిన సీసీఐ.. విచారణకు ఆదేశించింది.

ఎంఎస్ఎంఈలకు మరిన్ని రుణాలు

- యెస్ బ్యాంక్ ఎండీ ప్రశాంత్ కుమార్

హైదరాబాద్, మార్చి 15: దేశంలో ఆరో అతిపెద్ద ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థ యెస్ బ్యాంక్.. తెలంగాణ మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. దక్షిణాదిలో వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలకు అధికంగా రుణాలు ఇవ్వనున్నట్లు యెస్ బ్యాంక్ ఎండీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేయబోతున్న శాఖల్లో ఎంఎస్ఎంఈలకు రుణాలు అందించడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నట్లు, ముఖ్యంగా డిజిటల్ బ్యాంకింగ్ సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నిధులు లేక సతమతమవుతున్న చిన్న, సూక్ష్మ స్థాయి సంస్థలను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో వీరికి రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో బ్యాంక్ 25 శాఖలు నిర్వహిస్తుండగా, త్వరలో మరో నాలుగు శాఖలను ప్రారంభించాలనుకుంటున్నట్లు చెప్పారు.

వాణిజ్యలోటు కలవరం

ఫిబ్రవరి నెలలో 18 బిలియన్ డాలర్ల లోటు

న్యూఢిల్లీ, మార్చి 15: గత కొన్ని నెలలుగా నిరాశపనితీరు కనబరిచిన ఎగుమతులు మళ్లీ ఎగిశాయి. ఫిబ్రవరి నెలకుగాను ఎగుమతులు 11.9 శాతం పెరిగి 41.4 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఒకే నెలలో గరిష్ఠ స్థాయిలో నమోదవడం ఇదే తొలిసారి కావడం విశేషం. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఇదే సమయంలో దిగుమతులు కూడా 12.16 శాతం అధికమై 60.1 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. పసిడి దిగుమతులు అధికం కావడంతో వాణిజ్యలోటు 18.7 బిలియన్ డాలర్లకు ఎగబాకింది.

- గత నెలలో పసిడి దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 133.82 శాతం ఎగబాకి 6.15 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గతేడాది ఇది 2.63 బిలియన్ డాలర్లుగా ఉన్నది.
- ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి మధ్యకాలంలో పసిడి దిగుమతులు 38.76 శాతం ఎగబాకి 44 బిలియన్ డాలర్లకు చేరాయి.
- ఇంజినీరింగ్ గూడ్స్, ఎలక్ట్రానిక్ గూడ్స్, ఆర్గానిక్, ఇనార్గనిక్ కెమికల్స్, ఔషధాలు, ఫార్మాస్యూటికల్స్, పెట్రోలియం ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ నెలకొన్నది.
- ఫిబ్రవరిలో ఇంజినీరింగ్ గూడ్స్ ఎగుమతులు 15.9 శాతం అధికమై 8.58 బిలియన్ డాలర్ల నుంచి 9.93 బిలియన్ డాలర్లకు చేరాయి.
- ఏడాది క్రితం 1.94 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్ గూడ్స్ ఎగుమతి కాగా, ఈ సారి 54.81 శాతం వృద్ధితో 3 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.
- ఆర్గానిక్, ఇనార్గనిక్ కెమికల్స్ ఎగుమతులు 33 శాతం పెరిగి 2.95 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- ఔషధ, ఫార్మాస్యూటికల్స్ ఉత్పత్తుల ఎక్స్‌పోర్ట్స్ 22.24 శాతం చొప్పున అధికమయ్యాయి.
- పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు కూడా 5.08 శాతం అధికమై 8.24 బిలియన్ డాలర్లకు చేరాయి.
- మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి మధ్యకాలంలో ఎగుమతులు స్వల్పంగా పెరిగి 709.81 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇదే సమయంలో దిగుమతులు 4.64 శాతం అధికమై 782.05 బిలియన్ డాలర్లకు చేరాయి.
- వాణిజ్యలోటు 37.8 శాతం అధికమై 116.13 బిలియన్ డాలర్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇది 72.24 బిలియన్ డాలర్లుగా ఉన్నది.
- ఉత్పత్తుల వాణిజ్యలోటు 8.43 శాతం అధికమైన 245.94 బిలియన్ డాలర్లుగా ఉన్నది.

తెలంగాణలో ముత్తూట్ మైక్రోఫిన్

హైదరాబాద్, మార్చి 15: దేశంలో అతిపెద్ద మైక్రోఫైనాన్స్ సంస్థల్లో ఒకటైన ముత్తూట్ మైక్రోఫిన్..తెలంగాణలోకి అడుగుపెట్టింది. తొలి విడుత ఈ నెలలోనే నాలుగు శాఖలను ప్రారంభించబోతున్నట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా వ్యాపార విస్తరణలో భాగంగా ఈ నెలలోనే భువనగిరి, జనగాం, హన్మకొండ, పరకాలలో నాలుగు శాఖలను ప్రారంభించనున్నట్లు కంపెనీ సీఈవో సదాఫ్ సయ్యద్ తెలిపారు. త్వరలో ఏపీ మార్కెట్లోకి అడుగుపెట్టబోతున్నట్లు ప్రకటించారు.

ఎయిర్ ఇండియాలో 180 మందిపై వేటు

న్యూఢిల్లీ, మార్చి 15: టాటా గ్రూపునకు చెందిన విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఉద్యోగులకు షాకిచ్చింది. 180 మంది నాన్-ఫ్లయింగ్ సిబ్బందిని తొలగించినట్లు ప్రకటించింది. సంస్థ ఇటీవల ప్రకటించిన స్వచ్ఛంద పదవీ విరమణ పథకం(వీఆర్ఎస్), పునరుద్ధరణ అవకాశాలు ఎంచుకోకపోవడం వల్లనే వీరిపై వేటు వేసినట్లు కంపెనీ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. ఎయిర్ ఇండియాలో 18 వేల మంది సిబ్బంది ఉన్నారు.

టెస్లాకు లైన్ క్లియర్

కొత్త ఈవీ పాలసీని ఆమోదించిన కేంద్రం

కనీస పెట్టుబడి రూ.4,150 కోట్లుగా నిర్ణయం

బడా విదేశీ సంస్థలకు పన్ను ప్రోత్సాహకాలు



న్యూఢిల్లీ, మార్చి 15: నూతన ఎలక్ట్రిక్-వెహికిల్ (ఈవీ) పాలసీని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఆమోదించింది. ఈ కొత్త విధానం కింద 500 మిలియన్ డాలర్ల (రూ.4,150 కోట్లు)కు తగ్గకుండా పెట్టుబడులతో కంపెనీలు ముందుకు రావాల్సి ఉంటుంది. అప్పుడే దేశంలో ఏర్పాటుచేసే విద్యుత్తు ఆధారిత వాహనాల తయారీ కేంద్రాలకుగాను ఆయా సంస్థలకు పన్ను రాయితీలు అందుతాయి. గరిష్ఠంగా ఎంతైనా పెట్టుబడులు పెట్టవచ్చు. అయితే బడా ప్యాసింజర్ కార్ల కంపెనీలే లక్ష్యంగా ఈ విధానం ఉండటం గమనార్హం. ఇక ఈ-వెహికిల్స్ కోసం భారత్‌లో తయారీ కేంద్రాలను ఏర్పాటుచేసే కంపెనీలకు తక్కువ కస్టమ్స్ సుంకాలతో పరిమిత స్థాయిలో కార్లను కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వెసులుబాటు ఉంటుందని ఓ అధికారిక ప్రకటన చెప్పున్నది. పేరొందిన విదేశీ ఈవీ ఉత్పాదక సంస్థలచేత ఇక్కడ ప్లాంట్లను తెరిపించి.. భారత్‌ను ఈవీల తయారీ హబ్‌గా మార్చడమే ఈ పాలసీ ముఖ్యోద్దేశమని కూడా సదరు ప్రకటన పేర్కొన్నది.

మూడేండ్లలోపు..

పెట్టుబడి ప్రతిపాదనలతో వచ్చిన కంపెనీలు మూడేండ్లలోపు దేశంలో తయారీ కేంద్రాలను పెట్టి వాహనాల ఉత్పత్తిని కూడా మొదలు పెట్టాల్సి ఉంటుంది. అలాగే అందులో వాడే విడిభాగాల్లో కనీసం 25 శాతం భారత్‌లో తయారై నవే అయ్యుండాలి. ఐదేండ్లలోగా 50 శాతం విడిభాగాలు స్థానికంగా తయారైనవే ఉండాలి. అప్పుడే 15 శాతం దిగుమతి సుంకాల వద్దు ఏటా 8,000 కార్ల దిగుమతికి ఆయా కంపెనీలకు వీలుంటుంది. ఈ కార్ల విలువ 35,000 డాలర్లు, ఆపై ఉండాలి. అయితే 800 మిలియన్ డాలర్లు, ఆపై పెట్టుబడులు పెట్టిన సంస్థలకే ఈ అవకాశం. ఈ ప్రోత్సాహకాలు కూడా తొలి ఐదేండ్లే వర్తిస్తాయి. ప్రస్తుతం పూర్తిగా విదేశాల్లోనే తయారై దేశంలోకి దిగుమతి అవుతున్న ఈవీ కార్లపై వాటి ధరలు, ఇంజిన్ పరిమాణం ఆధారంగా 60 నుంచి 100 శాతం వరకు సుంకాలు పడుతున్నాయి.

టెస్లా కోసమే..

అమెరికాకు చెందిన ఈవీల తయారీ దిగ్గజం టెస్లాను భారత్‌కు రప్పించడమే ధ్యేయంగా ఈ కొత్త పాలసీ ఉందన్న అభిప్రాయాలు ఇండస్ట్రీ వర్గాల నుంచి ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. భారతీయ మార్కెట్‌లోకి రావాలని ఎప్పట్నుంచో ప్రయత్నిస్తున్న టెస్లా.. ఇక్కడి పన్నులతో వెనుకడుగు వేస్తున్నది. ఈ క్రమంలోనే కేంద్రంపై టెస్లా విమర్శలు కూడా చేసింది. దీంతో ఆ సంస్థపై మోదీ సర్కారు పెద్దలు ప్రతి విమర్శలూ చేశారు. ఇటీవలి ఓ ఇంటర్వ్యూలోనూ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్.. టెస్లాకు సరిపోయేలా విధానాలను భారత్ రూపొందించబోదన్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని ఈవీల కంపెనీలను ఆకట్టుకునేలా తమ చట్టాలు, టారిఫ్ రూల్స్ ఉంటాయని చెప్పారు. అయినప్పటికీ టెస్లాను ఆకర్షించేందుకు కొత్త ఈవీ పాలసీతో కేంద్రం ప్రయత్నాలు చేసిందన్న వాదనలుండటం గమనార్హం.

విదేశీ గుత్తాధిపత్యం

కేంద్ర ప్రభుత్వ కొత్త ఈవీ పాలసీ.. విదేశీ సంస్థలకు భారతీయ మార్కెట్‌లో గుత్తాధిపత్యాన్ని కట్టబెట్టేలా ఉందన్న విమర్శలు వస్తున్నాయి. పన్నులు తగ్గించిమరీ విదేశీ సంస్థలను దేశీయ విపణిలోకి తెస్తే.. ఇక్కడి కంపెనీల వృద్ధికి విఘాతం కలిగించినట్టేనని అంటున్నారు. కేవలం టెస్లాను ఆకట్టుకునేలా ఉందని, నిజానికి మొన్నటిదాకా ఆ సంస్థను తప్పుబట్టిన మోదీ సర్కారు యూటర్న్ ఎందుకు తీసుకుందో అర్థం కావడం లేదన్న వాదనలూ ఉన్నాయి. ఇదిలావుంటే 2030 నాటికి వార్షిక అమ్మకాల్లో ఈవీల వాటా కోటియూనిట్లుగా ఉండొచ్చని అంచనా. ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 కోట్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ ఈ పరిశ్రమ నుంచి వస్తాయని చెప్తున్నారు. 2022లో దేశీయ ఈవీ అమ్మకాలు దాదాపు 10 లక్షలుగా ఉన్నాయి. కంపెనీలపరంగా చూస్తే.. టాటా మోటర్స్ ముందున్నది. ఎన్నో రకాల మాడళ్లను విక్రయిస్తున్నది. నెక్సాన్, టియాగో, టిగోర్ రకాల్లో ఈవీలను అమ్ముతున్నది. హ్యుందాయ్, మహీంద్రా, కియా తదితర సంస్థలూ ఈ రేసులో పోటీపడుతున్నాయి. బీఎండబ్ల్యూ, ఆడీ, బెంజ్ వంటి లగ్జరీ సంస్థలూ ఈవీలను మార్కెట్‌లోకి తెస్తుండటం విశేషం.

ఆట

ఎంగ్డీ ఔట్

న్యూఢిల్లీ: త్వరలో మొదలుకానున్న ఐపీఎల్ సీజన్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ లుంగీ ఎంగ్డీ పూర్తిగా దూరమయ్యాడు. గాయం కారణంగా లీగ్‌కు తాను అందుబాటులో ఉండటం లేదని ఎంగ్డీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. దీంతో ఎంగ్డీ స్థానంలో ఆస్ట్రేలియాకు చెందిన ఆల్‌రౌండర్ జేక్‌ప్రేజర్ మెక్ గుర్క్‌ను తీసుకుంటున్నట్లు ఢిల్లీ ప్రకటించింది. మెల్‌బోర్న్‌కు చెందిన మెక్‌గుర్క్ హార్డ్‌హిట్టింగ్ ఓపెనింగ్ బ్యాటర్‌తో పాటు లెగ్ స్పిన్నర్. వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్ ద్వారా మెక్‌గుర్క్..ఆసీస్ తరపున అరంగేట్రం చేశాడు.

యూటీటీలోకి మహేశ్ భూపతి

ముంబై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్(యూటీటీ)లో భారత టెన్నిస్ దిగ్గజం మహేశ్ భూపతి రంగప్రవేశం చేశాడు. రానున్న సీజన్‌లో అహ్మదాబాద్ ఎస్‌జీ పైపర్స్ జట్టు ద్వారా లీగ్‌లో భూపతి అరంగేట్రం చేయబోతున్నాడు. జైపూర్ ప్యాట్రియాట్స్‌తో పాటు అహ్మదాబాద్ టీమ్ యూటీటీలో కొత్త జట్లుగా బరిలోకి దిగబోతున్నాయి. జాతీయ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్(టీటీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నీరజ్ బజాజ్, విితా దానీ యూటీటీ లీగ్‌ను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే లీగ్‌లో చెన్నై, ఢిల్లీ, గోవా, పుణెరీ, యూ ముంబా జట్లు పోటీలో ఉన్నాయి.

ఫైనల్లో ఆర్‌సీబీ

ముంబైపై ఉత్కంఠ విజయం • అర్ధసెంచరీతో పెర్రీ విజృంభణ

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) అద్భుతం చేసింది. మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను చిత్తుచేస్తూ తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. సమిష్టి ప్రదర్శన కనబరుస్తూ లో స్కోరింగ్ మ్యాచ్‌లో ముంబైని ఆర్‌సీబీ మట్టికరిపించింది. ఎలీస్ పెర్రీ అర్ధసెంచరీతో పోరాడే స్కోరు అందుకున్న బెంగళూరు..బౌలింగ్‌లోనూ భళా అనిపించింది. ఆర్‌సీబీ కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి ముంబై వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి మూల్యం చెల్లించుకుంది.



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో ఆర్‌సీబీ అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. లీగ్ దశలో తడబడి నిలబడ్డ ఆర్‌సీబీ..ముంబైతో కీలకమైన ఎలిమినేటర్ మ్యాచ్‌లో జూలు విదిల్చింది. శుక్రవారం ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 5 పరుగుల తేడాతో ముంబైపై ఉత్కంఠ విజయం సాధించింది. తొలుత ఎలీస్ పెర్రీ (50 బంతుల్లో 66, 8ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీతో బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 135/6 స్కోరు చేసింది. ఓపెనర్లు మందన(10), సోఫీ డివైన్ (10) నిరాశపరిచారు. మాథ్యూస్, బ్రంట్, ఇషాక్ రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ముంబై 20 ఓవర్లలో 130/6 స్కోరు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్(33) టాప్ స్కోరర్‌గా నిలిచింది. శ్రేయాంక పాటిల్ (2/16) రెండు వికెట్లు తీయగా, పెర్రీ, మిలోనెక్స్, వేర్‌హామ్, ఆశా శోభన ఒక్కో వికెట్ తీశారు. అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన పెర్రీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఆదివారం జరిగే లీగ్ ఫైనల్లో ఢిల్లీ, ఆర్‌సీబీ తలపడుతాయి.

ముంబై చేజేతులా:

స్వల్ప లక్ష్యఛేదనలో ముంబైకి సరైన శుభారంభం దక్కలేదు. యస్తికా భాటియా(19), మాథ్యూస్(15) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. 27 పరుగులకే ముంబై..మాథ్యూస్ వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత 23 పరుగులకే భాటియా ఔట్ కావడంతో ముంబై కష్టాల్లో పడింది. ఆదుకుంటుందనుకున్న స్కీవర్(23) కూడా నిరాశపరిచింది. ఈ దశలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్(33)..కెర్(27 నాటౌట్)తో కలిసి జట్టును గట్టెక్కించే ప్రయత్నం చేసింది. అయితే 24 బంతుల్లో 32 పరుగులు అవసరమైన దశలో ముంబై వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ఇదే అదనుగా పట్టు బిగించిన ఆర్‌సీబీ అనుకున్న ఫలితం రాబట్టింది.

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 135/6(పెర్రీ 66, వేర్‌హామ్ 18 నాటౌట్, మాథ్యూస్ 2/18, బ్రంట్ 2/18), **ముంబై:** 20 ఓవర్లలో 130/6(కౌర్ 33, కెర్ 27 నాటౌట్, పాటిల్ 2/16, మిలెనోక్స్ 1/16)

వన్డేలు, టీ20ల్లో స్టాప్‌క్లాక్

టీ20 ప్రపంచకప్‌లో రిజర్వ్‌డేలు

ఐసీసీ కీలక నిర్ణయాలు

దుబాయ్: క్రికెట్‌లో త్వరలో కొత్త నిబంధనలు రాబోతున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇక నుంచి వన్డేలు, టీ20ల్లో వృథా సమయాన్ని అరికట్టేందుకు ఐసీసీ స్టాప్‌క్లాక్ నిబంధనను తీసుకొచ్చింది. వెస్టిండీస్, అమెరికా వేదికలుగా జూన్ 1 నుంచి మొదలయ్యే టీ20 ప్రపంచకప్ నుంచి ఈ నిబంధన అధికారికంగా అమల్లోకి రానుంది. దీని ప్రకారం ఒక ఓవర్ ముగిసిన వెంటనే 60 సెకన్ల వ్యవధిలో కొత్త ఓవర్ వేయాల్సి ఉంటుంది. 60 సెకన్ల వ్యవధిలో కొత్త ఓవర్ వేయని పిమ్మట ఆన్‌ఫీల్డ్ అంపైర్ రెండు సార్లు వార్నింగ్ ఇస్తాడు. ఇలా నిబంధను ఉల్లంఘిస్తే..ఐదు పరుగుల పెనాల్టీ ఎదుర్కొవాల్సి వస్తుంది. 'జూన్‌లో జరిగే టీ20 ప్రపంచకప్ నుంచి వన్డేలు, టీ20ల్లో స్టాప్ క్లాక్ నిబంధన పర్మినెంట్‌గా తీసుకొస్తున్నాం. ఏప్రిల్ వరకు ఈ ట్రయల్ కొనసాగుతున్నది. ఇప్పటికే ఈ నిబంధనను ప్రయోగాత్మకంగా వాడుతున్నాం. దీని ద్వారా వన్డేల్లో 20 నిమిషాల వరకు సమయం ఆదా అయ్యే అవకాశముంది' అని ఐసీసీ వార్షిక బోర్డు మీటింగ్‌లో పేర్కొంది. ఇదిలా ఉంటే కొన్ని సందర్భాల్లో స్టాప్ క్లాక్ నిబంధనకు మినహాయింపులు ఇచ్చారు. మరోవైపు మెగాటోర్నీలో సెమీస్, ఫైనల్ మ్యాచ్‌లకు రిజర్వ్ డేలు ప్రకటించారు. భారత్, శ్రీలంక వేదికలుగా 2026లో జరిగే టీ20 ప్రపంచకప్‌లో 20 జట్లు పోటీపడనున్నాయి.

సాత్విక్ జోడీ నిష్క్రమణ

ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్

బర్మింగ్‌హామ్: ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్ల పేలవ ప్రదర్శన కొనసాగుతున్నది. ఇటీవలే ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలిచి మంచి జోరుమీదున్న భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి తమ పోరాటాన్ని ముగించారు. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో సాత్విక్, చిరాగ్ ద్వయం 16-21, 15-21తో మహమ్మద్ షోహిబుల్, బాగాస్ మౌలానా జోడీ చేతిలో ఓటమిపాలైంది. టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన సాత్విక్, చిరాగ్..ప్రత్యర్థి జోడీపై దీటైన ఆటతీరు కనబర్చలేకపోయారు. మరోవైపు మహిళల డబుల్స్‌లో తనీశా క్రాస్టో, అశ్విని పొనప్ప జోడీ 21-11, 11-21, 11-21తో చైనా ద్వయం జాంగ్ షు, జెంగ్ యు చేతిలో ఓడింది.

విదేశంలో ఐపీఎల్!

న్యూఢిల్లీ: ఐపీఎల్ రెండో దశ మ్యాచ్‌లు భారత్ బయట జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు శనివారం షెడ్యూల్ ప్రకటించనున్న నేపథ్యంలో లీగ్ నిర్వహణపై త్వరలో స్పష్టత రానుంది. అయితే ఇప్పటికే తొలి దశ షెడ్యూల్ విడుదలకాగా, మలి షెడ్యూల్ ఎన్నికలను అనుసరించి ఐపీఎల్ మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకోనుంది. ఫ్రాంచైజీలు తమ ప్లేయర్ల పాస్ట్‌పోర్ట్‌లు తీసుకుని వీసాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదే జరిగితే ఈ సారి ఐపీఎల్ విదేశాల్లో జరిగే చాన్స్ ఉంది.

భారత్‌దే ఐదో టీ20

శ్రీలంకపై ఘన విజయం

న్యూఢిల్లీ: శ్రీలంకతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత అంధుల క్రికెట్ జట్టు క్లీన్ స్వీప్ చేసింది. శుక్రవారం జరిగిన ఆఖరిదైన ఐదోమ్యాచ్‌లో భారత్ 90 పరుగుల